క్లుప్తంగా

హజ్ యాత్రికులకు సన్మానం



వనపర్తిటౌన్: జీవితంలో ఒక్క సారైన ముస్లింలు హజ్ యాత్రను చేయాలని కో–ఆప్షన్ సభ్యుడు గులాం ఖాదర్ ఖాన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం హజ్ యాత్రకు బయలుదేరుతున్న అబ్దుల్ హకీం, రషీద్ ఇమాంలను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. హజ్ యాత్ర జీవితంలో పుణ్యఫలమని, వనపర్తి, తెలంగాణ రాష్ట్ర బాగు కోసం ప్రార్థించాలని, హజ్ యాత్రను పూర్తి చేసుకొని క్షేమంగా తిరిగిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నీలస్వామి, ఎర్ర శ్రీను, ఆరీఫ్, అనీస్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్: హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులను ముస్లింలు ఘనంగా సత్కరించారు. ఆదివారం మస్జీదే సయ్యదియాలో హజ్‌యాత్రకు వెళ్తున్న అఫ్తాబ్, అజ్హర్‌లను మస్జీద్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా హఫీజ్ అజ్హర్‌అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖలీల్, అన్వర్, రఫీఖ్, మస్తాన్, ఫెరోజ్, అహ్మద్, మునీర్, హనీఫ్, నజీర్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన కోనేరు రామచంద్రయ్య కుటుంబాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ప్రజా వైద్యులు డా.పగిడాల శ్రీనివాసులు ఆదివారం గ్రామాన్ని సందర్శించి మృతదేహానికి నివాళి అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ వెంకటయ్యయాదవ్, సురేందర్‌గౌడ్, నర్సింహ, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా యువకులు



ఖిల్లాఘనపురం: మండల పరిధిలోని సోళీపురానికి చెందిన నరేష్(22)కు కొన్ని రోజులుగా కాళ్లకు ఇన్‌ఫెక్షన్ కావడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో మృతుడి మిత్రులు వాల్మీకి సంఘం యువత ముందుకు వచ్చి ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. మృతుడి కుమార్తె పేరున ఎస్‌బీఐలో ఖాతా ఓపన్ చేసి కొంత నగదును జమ చేస్తామన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, ఆంజనేయులు, తిలక్, నరసింహ, యాదగిరి, పరశురాం, రామస్వామి, రాజు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు



మల్దకల్: మండల కేంద్రమైన మల్దకల్‌లోని శ్రీ గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలను సోమవారం నుంచి ఈనెల 17 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం సుప్రభాతసేవ, 8గంటలకు పంచామృతాభిషేకం, 14న కల్యాణోత్సవం, 15న పల్లకీ సేవ, 16న వీరబ్రహ్మేంద్రస్వామి వ్రతం, ఊరేగింపు, 17న స్వామి వారికి ప్రత్యేక పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నారు.

వాహనాల తనిఖీ

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఆదివారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టును ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడు పరిశీలించి తనిఖీ నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, లిక్కర్, డబ్బు రాకుండా అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత

- కేంద్రాలకు చేరుకున్న అధికారులు

ఆత్మకూర్: మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూర్ మండలంలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని తహసీల్దార్ రాజు, ఎస్‌ఐ నరేందర్, కమిషనర్ నాగరాజు కోరారు. ఆదివారం పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. మండలంలో మొత్తం 31,011 ఓటర్లకు గాను, 35 పోలింగ్ కేంద్రాల్లో ఆరుగురు సెక్టోరియల్ అధికారులు, ఒక్క బూత్‌కు ఐదుగురు పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారని



విధులకు హాజరయ్యేందుకు వస్తున్న సిబ్బంది



పాన్‌గల్‌లో ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఎస్‌ఐ వేణు

తెలిపారు. ఆత్మకూర్, రేచింతల, ఆరేపల్లి, పిన్నంచర్ల గ్రామాల్లోని 15 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా గుర్తించామని, అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయ్యడంతో పాటు తాగునీరు, షామియానాలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తదితర సౌకర్యాలు సమకూర్చామని చెప్పారు. రాజకీయపార్టీలకు చెందిన వారు సమస్యలను సృష్టించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో వచ్చినప్పటి నుంచి రూ.9.60 లక్షలు నగదు, రూ.78 వేలు విలువ చేసే 120 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పోలింగ్ బూత్‌ల వద్ద 60 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

కొత్తకోట, అమరచింత, వీపనగండ్ల పరిధిలో..



ఆత్మకూర్‌లో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న అధికారులు

కొత్తకోట రూరల్: కొత్తకోట మండల కేంద్రంతో పాటు, వివిధ గ్రామాల్లో మొత్తం 52,728 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 25,859 పురుషులు, 26,869 మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వికలాంగులు తమ ఓటు వినియోగించుకునేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలో 20 పోలింగ్ కేంద్రాలు, మండలంలోని 22 గ్రామాల్లో 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల విధుల్లో 240 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీస్పీ, సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, పారామిలిటరీ పోలీసులతో పాటు 105 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలియజేశారు. ఉదయం 7 గంటల నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గుంపులు, గుంపులుగా ఉండకూడదని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు. పట్టణ కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఏఎస్పీ రాందాస్ తేజావత్, డీఎస్పీ జె.వెంకటేశ్వర్లు, సీఐ రాంబాబు పరిశీలించారు.

అమరచింతలో..

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పూర్తి చేశామని



ఆత్మకూర్ పోలింగ్ కేంద్రంలో అధికారులు



అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రానికి విధుల నిర్వహణకు వస్తున్న అధికారులు

తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపారు. మండల పరిధిలో మొత్తం 26 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వీటిలో మొత్తం ఓటర్లు 22,958 మంది ఉన్నారని తెలిపారు. పురుషులు 11,243 మంది ఉండగా, మహిళలు 11,715 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు. సెక్టోరియల్ అధికారులుగా మారుతి ఏఈ పీఆర్, శ్రీనివాసులు ఎంపీడీఓ అమరచింత, భాస్కర్ సింగ్ ఎంఈఓ ఆత్మకూర్, వెంకటేశ్వర్లు ఏఈఈ మక్తల్, అబ్దుల్ వకీల్ అహమ్మద్ ఏఈఈ మక్తల్ నియమించినట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వసతి, మరుగుదొడ్ల వసతి కల్పించామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎంలను ఏర్పాట్లు చేసుకున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించామని ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపారు. కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది ద్వారా గట్టి నిఘాతో పాటు రాత్రి వేల పెట్రోలింగ్ చేపడుతున్నట్లు వివరించారు.

వీపనగండ్లలో..

వీపనగండ్ల: మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో 29 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. మొత్తం 29 పోలింగ్ స్టేషన్‌లో 23,938 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. అందులో పురుషులు 12,057 మంది, మహిళలు 11,880 మంది, ట్రాన్స్ జెండర్స్ ఒకరు ఉన్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని 162 పోలింగ్ బూత్‌ను ఆదర్శ పోలింగ్ బూత్‌గా నిర్ధారించి ఓటర్లను చైతన్యపరిచేలా అలంకరించినట్లు తెలియజేశారు. మండలంలోని ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

పాన్‌గల్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పోలింగ్ మండల అధికారి సుభాష్‌నాయుడు తెలియజేశారు. మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో మొత్తం 41,469 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 21,103 మంది పురుషులు, 20,365 మంది స్త్రీలు, ఇతరులు ఒక్కరు ఉన్నారు. మండలంలో 44 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క పోలింగ్ బూత్‌కు నలుగురు చొప్పున 176 మంది విధులు నిర్వహించనున్నారు. ఎన్నికల విధుల అనంతరం ఈవీఎం బాక్సులను చేరవేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

భద్రతకు పోలీస్ సిబ్బంది..

మండలంలో ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు పోలీస్ సిబ్బందిని నియమించారు. ఒక డీఎస్పీ, ఒక సీఐ, ఎస్‌ఐతో పాటు మొత్తం 100 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ వేణు పేర్కొన్నారు. పోలింగ్ జరిగే అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికలు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. మండలంలో ఐదు రూట్లను ఏర్పాటు చేశామని, ఆయా రూట్లలో సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో చిక్కేపల్లి, బుసిరెడ్డిపల్లి, పాన్‌గల్, రేమద్దుల, కేతేపల్లి గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సిబ్బందితో పాటు ఒక మొబైల్ టీం పర్యవేక్షణ చేస్తుందన్నారు.



పాన్‌గల్ పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు చేసుకుంటున్న సిబ్బంది

మొబైల్ టీంల ఏర్పాటు

ఆత్మకూర్: ఓటర్లు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని జిల్లా అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజావత్ అన్నారు. ఆదివారం రాత్రి ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. కేసుల నమోదు, ఇతర వివరాలను ఎస్‌ఐ నరేందర్‌తో అడిగి తెలుసుకున్నారు. నేడు జరుగనున్న ఎన్నికలకు ప్రజలందరూ సహకరించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద 60 మంది సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశామని మొబైల్ టీంల ద్వారా మండలంలోని 35 పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన వారు సమస్యలను సృష్టించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



రాందాస్ తేజావత్ జిల్లా అడిషనల్ ఎస్పీ

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆదివారం ఆదిశంకరాచార్య జయంతి వేడుకలను నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదిశంకరాచార్యులు 7 సంవత్సరాల వయస్సులోనే వేదాలను అధ్యయనం చేసి, మహాజ్ఞాని అయ్యాడని తెలిపారు. ఇంటిని వదిలి వెళ్లి 16 సంవత్సరాల వయస్సు నాటికి తన రచనలను పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో పల్లా శ్రీనివాసులు, ఆశన్న, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న గోపి

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కొత్తకోట రూరల్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పౌరసరఫరాలశాఖ జిల్లా ఇన్‌చార్జ్ మేనేజర్ ప్రవీణ్ నిర్వాహకులకు సూచించారు. ఆదివారం మండలంలోని ముమ్మళ్లపల్లి, అమడబాకుల, రాయిణిపేటలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ సీఈఓ బాలరాజుతో కలిసి తనిఖీ చేశారు. కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి అనుకూలంగా ఉంటే వెంటనే తూకం చేయాలన్నారు. తూకాలు పూర్తయిన వెంటనే కేటాయించిన రైస్‌మిల్లుకు తరలించాలని, సకాలంలో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని కోరారు.



ముమ్మళ్లపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మేనేజన్ ప్రవీణ్

ఓటు వేసే విధానంపై అవగాహన

తాడూరు: మండలంలోని అల్లాపూర్‌లో ఓటర్లకు ఓటు వేసే విధానంపై మాలమహానాడు రాష్ట్ర నాయకుడు జెట్టి చినవెంకటేష్ అవగాహన కల్పించారు. సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని వివరించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గ్రామస్తులకు అడిగిన పలు ప్రశ్నలను నివృత్తి చేశారు. సమావేశంలో గ్రామస్తులు శ్రీనివాసులు, మల్లేష్ తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

రేపటి నుంచి కంప్యూటర్ శిక్షణ

కొల్లాపూర్: రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14వతేదీ నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులు ప్రారంభించనున్నట్లు సంస్థ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, శిక్షకుడు భీమయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులకు ఎంఎస్ ఆఫీస్, డీటీపీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తునట్లు వివరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్: 9177050558, 9989761951 నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

వైద్య శిబిరం ఏర్పాటు



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ప్రశాంతి సన్నిధిలో ఆదివారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా శిబిరంలో 457 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 295 మందికి షుగర్, 412 మందికి బీపీ, ఐదుగురికి ఈసీజీ చేశారు. 48 మందికి కంటి పరీక్షలు చేయగా 36 మందికి ఆపరేషన్ అవసరం ఉందని గుర్తించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు.

నృత్య శిక్షణ ప్రారంభం

వెల్దండ: ఐక్యత, వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి సంగీత నృత్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్ దాస్, జనరల్ సెక్రెటరీ వనం విజయకుమార్, అభినవ్‌రెడ్డి, శ్రీరామ్, జ్యోతి ఉన్నారు.

పోలింగ్ కేంద్రం కిటికీ అపహరణ

రాజోళి: మండలంలోని ముండ్లదిన్నె గ్రామంలో పోలింగ్ బూత్ కేంద్రానికి ఉన్న కిటికీని దుండగులు అపహరించారు. స్థానికుల వివ రాల మేరకు.. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొన్ని మరమ్మతు పనులు చేపట్టారు. అందులో పోలింగ్ బూత్ నెంబర్ 150 ఏర్పాటు చేయగా, శనివారం రాత్రి పాఠశాల భవనానికి ఉన్న కిటికీని దుండగులు తొలగించారు. ఆదివారం ఉదయం భవనానికి కిటికీ లేకపోవడంతో స్థానికులు విస్తూపోయారు. ఓటర్లు తమ ఓటును గోప్యంగా వేసేందుకు వీలు ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఏది ఏమైనా ఎన్నికల సమయంలో ఇలాంటి చర్యకు పాల్పడడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



బీఆర్‌ఎస్‌తోనే క్రైస్తవుల అభ్యున్నతి

నాగర్‌కర్నూల్: బీఆర్‌ఎస్‌తోనే క్రైస్తవుల అభ్యున్నతి సాధ్యమని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీ ఓటు వేయాలో చర్చించారు. బీఆర్‌ఎస్ సెక్యులర్ పార్టీ అని ఆ పార్టీకే మద్దతు ఇవ్వాలని తీర్మానించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని పాస్టర్లు కోరారు. క్రైస్తవ ఉద్యమకారుల ఫోరమ్ కన్వీనర్ అనిల్ కొర్నేలీస్, క్యాథలిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, అధ్యక్షుడు ఆంద్రూస్, లూథర్ మోసెస్, జెరిపోతుల స్వామిదాసు, మోజెస్ దాస్, ఫిలిప్ థియోడార్, ఎంపీ జాన్సన్, మత్తయ్య, పాస్టర్లు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతున్న క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

కోడేరు: మండలంలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశంకోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఉమఅస్రా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బైపీసీలో 40 సీట్లు, ఎంపీసీలో 40 సీట్లు, సీఈసీలో 40 సీట్లు, ఎంఈసీలో 40 సీట్లు, ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అండగా ఉంటాం..

కల్వకుర్తిరూరల్: పేద విద్యార్థులకు అండగా ఉంటామని క్లాస్‌మెట్ క్లబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్ అన్నారు. ఆదివారం కల్వకుర్తిలో క్లాస్‌మెట్ క్లబ్ డివిజన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా డివిజన్ కమిటీ ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేందర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రమేష్, లక్ష్మీనర్సింహ రావు, శోభన్‌బాబు, శ్రీధర్, రాఘవేందర్, అశోక్, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో నైపుణ్యాల పెంపుదల

- మండలంలో సోళీపురం, ఖిల్లాఘనపురం గ్రామాల్లో కొనసాగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్, హాకీ ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ శిబిరాలకు పలు గ్రామాల నుంచి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిక్షణ పొందుతున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన క్రీడాకారులు ఈ శిబిరాల్లో కోచ్‌ల ద్వారా శిక్షణ తీసుకుంటున్నారు.

అథ్లెటిక్స్, హాకీలో శిక్షణ

గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు గాను మండలంలో జిల్లా యువజన, క్రీడల శాఖల ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. మండలంలోని సోళీపురంలో హాకీ శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో పాటుగా పీఈటీ మన్యంను కోచ్‌గా నియమించారు. అదేవిధంగా ఖిల్లాఘనపురంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసి ఎస్‌ఐఎస్ అథ్లెటిక్స్ కోచ్ దేవేందర్‌ను ఈ శిబిరానికి కోచ్‌గా నియమించారు. క్రీడాకారులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం క్రీడాకారులకు హాకీ, రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావలింగ్ త్రోలో కోచ్‌ల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నారు.



పరుగులు తీస్తున్న క్రీడాకారులు



ఖిల్లాఘనపురం మండలం సోళీపురంలో హాకీ శిక్షణలో క్రీడాకారులు

ఉచితంగా క్రీడా సామగ్రి...

ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రిని జిల్లా యువజన, క్రీడల శాఖ వారు ఉచితంగా అందించినట్లు కోచ్‌లు తెలిపారు. మే 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటుగా ప్రశంసా పత్రాన్ని అందించడం జరుగుతుందన్నారు. 8 నుంచి 14 సంవత్సరాల క్రీడాకారులు హాకీ శిబిరంలో 30 మంది, అథ్లెటిక్స్ శిబిరంలో 35 మంది మొత్తం 65 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు.



వ్యాయామం చేస్తున్న క్రీడాకారులు

చాలా ఉపయోగంగా ఉంది



మా గ్రామంలోని పాఠశాల ఆవరణలో వేసవి హాకీ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడంతో మాకు చాలా ఉపయోగపడుతుంది. ఈ శిక్షణలో కోచ్ మాకు హాకీలో మెలకువలు నేర్పిస్తున్నారు. ఈ శిబిరంలో గతేడాది మాకు అందించిన శిక్షణతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ముమ్ముందు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చడానికి ఎంతో ఉపయోగపడుతుంది.

– రాకేష్, రాష్ట్ర స్థాయి హాకీ క్రీడాకారుడు, సోళీపురం

మంచి అవకాశం



గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామం. క్రీడాకారులకు ఇది మంచి అవకాశం. సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి.

– దేవేందర్, ఎస్‌ఐఎస్ అథ్లెటిక్స్ కోచ్